# విధి ఒక విషవలయం..

-ఆదూరి సావిత్రి

నాలుగు రోజుల్నుంచీ ఎడతెరిపి లేకుండా కురుస్తోంది వర్షం....

కన్ను ముయ్యకుండా గస్తీ తిరిగే భద్రతా దళాల్లాగా సూర్యుడిని బయటకు రానివ్వకుండా కాపలా కాస్తోందా అన్నట్టు, వర్షం మబ్బుల్ని కూడా వెంటేసుకుని, ఒక్క క్షణం కూడా కను మరుగవటల్లేదు. . .


ఫామిలీతో...మొక్కుబడి తీర్చుకోటం కోసం ద్వారకా తిరుమల వచ్చాడు జయాకర్.

అతను ఒక ప్రయివేటు ఫరంలో, మంచి పొజిషన్‌లో ఉన్న ఉద్యోగి. భార్య, చెల్లెలు, కొడుకు, కూతుర్లతో కలిసి అక్కడికి వచ్చాడు.

ఇంత వర్షంలో ప్రయాణం ఎలా చెయ్యాలో....- దారిలో ఎక్కడా చిక్కుకోకుండా గమ్యస్థానం ఎలా చేరాలో అర్థం కావటంలేదతనికి.

ఎలాగో ఏలూరయినా చేరుకోగలిగితే అక్కడనుంచి ఏదో మార్గం ఆలోచించొచ్చు అనుకుంటూ ధైర్యం తెచ్చుకుని ప్రయాణం సాగించటానికే నిశ్చయించుకున్నాడు....

స్వామిదేవిపల్లె వచ్చేసరికి గాలి వాన ఉధృత రూపం దాల్చింది. కమ్యూనికేషన్స్ తెగిపోయాయి.




అక్కడనుంచి ఏలూరు చేరుకోటానికి దార్లో రోడ్లు గళ్ళు పడటంవల్ల అక్కడే ఆగిపోవలసొచ్చింది.

సాయంత్రం నాలుగు గంటలయింది. గాఢమైన మబ్బులు, వర్షం వల్ల అప్పటికే చీకటి పడ్డట్టుంది.....

"తిరుపతిలో నన్నా ఉండవలసింది. అప్పుడీ పరిచయంలేని పల్లెలో... పిల్లలతో ఎలా అవస్థ పడతాం?" భయంగా అన్నది జయాకర్ భార్య అరుంధతి.

"ఈ ఊరిలో లాడ్జిలో రూంలు దొరుకుతాయా?" అన్నాడు జయాకర్ అక్కడ పాత హోటల్ యజమాని దగ్గరకు వెళ్ళి.

"లాడ్జిలో రూంలు ఇచ్చేపాటి పెద్ద ఊరు కాదు బాబూ ఇది. అంతేకాదు ఈ పల్లెలో కాఫీ హోటల్ తప్ప, భోజన హోటల్ కూడా లేదు" అంటూ, జయాకర్ పరిస్థితి గురించి విని, "అయ్యో! వెంట ఆడోళ్ళు, పిల్లలూ కూడా ఉన్నారే! ఇంకా నాలుగు రోజులన్నా పడుతుంది, రోడ్డు బాగయి, ఏలూరు వెళ్ళటానికి." అన్నాడు పాక హోటల్ యజమాని పానకాలు.

మై గాడ్! ఎలా?

చేతినిండా డబ్బు ఉండి కూడా ఒక్కోసారి మనిషి ఎంత నిస్సహాయుడుగా మారతాడో అలాంటి పరిస్థితిలో పో దా? డబ్బు కూడా ఎలా చిన్న మెత్తు విలువయినా చెయ్యవో ప్రత్యక్షంగా అర్థమవుతోంది జయాకర్‌కి.

"ఓ పని చెయ్యండి" అన్నాడు పానకాలు.

ఆశగా చూశాడు జయాకర్

"ఈ వూరి కరణంగారింటి కెళ్ళండి. అక్కడయితే మీరు ఎన్ని రోజులయినా నిశ్చింతగా ఉండొచ్చు. ఏమీ ఇబ్బంది కూడా ఉండదు" అంటూ ఓ మనిషిని తోడిచ్చి, కరణంగారింటికి పంపాడు పానకాలు వాళ్ళని

* * *

తెల్లని పంచె, పొట్టి చేతుల తెల్ల చొక్కా వేసుకుని, పచ్చగా ఉన్న యాభై సంవత్సరాలు పైబడ్డ వ్యక్తి వాకిట్లో కొచ్చాడు.

"వీరే మా కరణంగారు" అన్నాడు పానకాలు పంపిన కుర్రాడు.

"నమస్కారమండీ నాపేరు జయాకర్....." అంటూ వివరాలు చెప్పి, "ఇక్కడ అడిగితే మీ ఇంటికి వెళ్ళమన్నారు" మొహమాటంగా అన్నాడు జయాకర్.

"లోపలికి రండి. రండమ్మా" అంటూ వాళ్ళని ఆదరంగా లోపలి కాహ్వానించి భార్యకు, పిల్లలకూ పరిచయం చేశాడు కరణం.

ఆయన భార్య కామేశ్వరమ్మ. సగం నెరిసిన జుట్టు, చామన ఛాయ, ఆప్యాయత కలబోసుకున్న కళ్ళు, చిరు నవ్వును వదలని పెదవులు... .

ఆమెను చూస్తూనే నమస్కారం చేసింది అరుంధతి అప్రయత్నంగా.

"స్నానాలు చెయ్యండమ్మా వేడి నీళ్ళున్నాయి" అంటూ తాటాకుల దడి వున్న పాకలో నీళ్ళు తోడించి పెట్టించా దావిడ

పెద్ద మండువా లోగిలితో... పురాతనమైన, గంభీరమైన ఫర్నీచర్‌తో ఉన్న ఇల్లు. ఆ ఇంట్లో కృత్రిమ నాగరికతకు దూరంగా, అమాయకత్వం, ఆప్యాయతల అద్భుతమైన కలయికతో ఉన్న మనుషులు జయాకర్ కుటుంబాన్ని బాగా ఆకట్టుకున్నారు:

బాత్రూంలో షవర్ కింద గోరు వెచ్చని నీళ్ళు స్నానం చేస్తూ. డైనింగ్ టేబుల్‌మీద వెండి కంచాలలో రక రకాల కూరలతో భోజనం చేస్తూ, మొజాయిక్ ఫ్లోరింగ్ ఉన్న బిల్డింగ్‌లో స్లిప్పర్స్‌తో తిరుగుతూ.... ఏ సి రూంలో ఫోమ్ బెడ్‌మీద నిద్ర పోయే ఖరీదైన మనుషులు జయాకర్ వాళ్ళు.

ఇక్కడ అవేం లేకపోయినా.....మట్టి నేల అయినా, "దేవుడింట్లోకి, భోజనాల గదుల్లోకి చెప్పులతో రాగూడదమ్మా" అని కామేశ్వరమ్మ చిరు నవ్వుతో మందలిస్తే, ఉట్టి కాళ్ళతో తిరిగినా ఇబ్బందిగా.....ఎబ్బెట్టుగా ఫీలవలేదు వాళ్ళు.

వాళ్ళ లగ్జరీస్ నన్నిటినీ డామినేట్ చెయ్యగలిగింది ఆ ఇంట్లో వాళ్ళ ఆప్యాయత....

నేలమీద పెద్ద పెద్ద పీటలు వేసి, ఇత్తడి మర చెంబులతో మంచి నీళ్ళు పెట్టి, అరిటాకులలో అన్నం వడ్డించారు.

కంది పచ్చడి, ఆవకాయ, పచ్చి పులుసు, పెరుగు, అన్నంలోకి ఆధరువులు.

నెయ్యి వేస్తూ "కూరలేం లేవు బాబూ. ఎలా తింటారో." నొచ్చుకుంటూ అన్నది కామేశ్వరమ్మ.

"ఇంకానయం. మీరు అభిమానంగా ఒడ్డిస్తుంటే ఈ భోజనం ఎంత అద్భుతంగా ఉందో తెలుసా? మీరు ఈ సమయంలో ఇలా మమ్మల్ని ఆదుకోకపోతే ఏమయిపోయే వాళ్ళమో!" అన్నారు జయాకర్, అరుంధతి.

అన్నం తిన్నాక, సావిట్లో నవ్వారు మంచాలు మగ వాళ్ళకి, నులక మంచాలు ఆడవాళ్ళకి వేశారు....నిశ్చింతగా నిద్ర పోయారు జయాకర్ కుటుంబం.

అలా వాళ్ళింట్లో నాలుగు రోజులుండాల్సొచ్చింది....జయాకర్ గిల్టీగా ఫీలవుతుంటే.....

"నువ్వంతగా బాధ పడాల్సిం దేముంది నాయనా ఇందులో? నేను గ్రామాధికారిని. అంటే....గ్రామం మీద ఉధికారం చలాయించడమే కాదు....ఇలా గ్రామానికి పిలిచిన, దేవుడు పంపిన అతిథు లెవరైనా వస్తే, గ్రామ ప్రజలందరి తరుపున సాధ్యమైనంత వరకూ ఆదుకోవలసిన బాధ్యత కూడా నాదే.

ఇక్కడ కొచ్చిన మా రెవెన్యూ డిపార్ట్‌మెంటు అధికారులకే కాదు ఎలక్షన్ డ్యూటీ కొచ్చిన ఉద్యోగులు, టీకాలినస్పెక్టర్లు, మలేరియా నివారణకు చర్యలు తీసుకునే ఆఫీసర్లు, ఇలా ఎవరొచ్చినా మా ఇంట్లోనే భోజనం ఏర్పాటు చేస్తాను. ఉన్నంతలో అతిధికి అన్నం పెట్టకుండా పంపే అలవాటు మాకు లేదు.

మీ రెన్నాళ్ళున్నా మాకేం ఇబ్బంది లేదు.

మాకు కాసిని వడ్లు పండుతాయి పాడి ఉన్నది రైతులకూ, షావుకార్లకూ, ఊళ్ళో ఉన్న మిగిలిన వాళ్ళకూ చిన్న పనికి, పెద్ద పనికీ మేము అండగా ఉంటాం. వాళ్ళు వాళ్ళకు పండిన కాయో కసరో, కంది గింజ, పెసర గింజ, తృణమో, పణమో ఇస్తుంటారు ఆడంబరాలు లేకుండా... నిలవెయ్యాలనే కాంక్ష లేకుండా ఉంటే ..!

ఉండటానికి, తినటానికి, అతిధి అభ్యాగతి వస్తే ఉన్నంతలో పెట్టటానికి మాకు ఏవిధమైన ఇబ్బందీ లేకుండా మనుగడ సాగిపోతూ ఉంటుంది.

మీరే సంకోచాలూ పెట్టుకోవద్దు" అన్నాడు కరణం..

అయిదు రోజుల తరవాత, వాళ్ళ దగ్గర వీడ్కోలు తీసుకుని, వాళ్ళ స్మృతుల్ని మనసునిండా నింపుకుని, ఊరు దాటారు జయాకర్, అతని కుటుంబం.

ఆరు సంవత్సరాలు కాల గర్భంలో కలిసి పోయాయి...జయాకర్ చెల్లెలికి పెళ్ళయింది. ఆమెను ద్వారకా తిరుమల వేపు ఇచ్చారు.

ఒకసారి చెల్లెలిని చూడటాని కొచ్చాడు జయాకర్. తిరుగు ప్రయాణంలో మద్దులూరులో బస్సు కోసం వెయిట్ చేస్తూ నిలబడ్డాడు.


స్వామిదేవిపల్లెకు సమీపంలో ఉన్న పెద్ద ఊరు, కూడలి మద్దులూరే

అరవయ్యేళ్ళ వృద్ధుడు జయాకర్ వద్దకొచ్చి సంకోచిస్తూ "పళ్ళ పొడి కొంటారా బాబూ? మీరు కొనే పొట్లాలకన్నా చాలా చవక. ఇంత పెద్ద ప్యాకెట్టు ఒక్క ముప్పావలా మాత్రమే" అన్నాడు.

యాదాలాపంగా ఆ వ్యక్తి కేసి చూసిన జయాకర్ కళ్ళు, చురుగ్గా అయ్యాయి. అతని మనసు శర వేగంతో ఆరు సంవత్సరాలు వెనక్కి వెళ్ళి, అక్కడే పెనుగులాడుతూ సందేహంగా ఆగిపోయింది.....

"మీరు. . మీరు స్వామిదేవిపల్లె కరణంగారు కదూ?" విభ్రాంతిగా అడిగాడు జయాకర్.

"ఇంకెక్కడి కరణంలే బాబూ! కరిణీకాలు పోయాయిగా!" అన్నాడాయన నిర్లిప్తంగా. జయాకర్ వేపు నిశితంగా చూస్తూ, "మీరు నన్నెరుగుదురా?" అన్నాడు మళ్ళీ.



"నేను జయాకర్‌నండీ. ఆరేళ్ళ క్రితం నేను, నా భార్యా పిల్లలతో గాలి వానల్లో మీ ఊరులో చిక్కు బడితే....అయిదు రోజులపాటు మీరు మాకు ఆతిథ్య మిచ్చారు. మీ ఇంటికి అనేకమంది వస్తుంటారు. మీకు గుర్తు లేదేమో గానీ....మాకు మాత్రం....." అంటున్న జయాకర్ మాటలకు అడ్డు వస్తూ "ఔను. గుర్తొచ్చింది. అమ్మాయీ, పిల్లలూ బావున్నారా?" అన్నాడు కరణం.

"మిమ్మల్ని ఈ స్థితిలో చూస్తున్నా నేమిటి? నేను కలగనటం లేదు కదా?!" అన్నాడు జయాకర్.

"కరిణీకాలు పోయాయి. నాకు వయ సుడిగి పోయింది. ఏ పనీ చెయ్యలేను. సంసారం ఈదాలి.....

నా కొడుకూ కూడా కరణమే. వాడికి ఏజ్ బారయి-పోయింది. గవర్నమెంటు ఉద్యోగానికి పనికిరాడు. కరిణీకం చేసుకుంటే ఉన్న ఊరికి దగ్గరలోనే కుదురుగా బతకొచ్చు అనే ఉద్దేశ్యంతో వాడి నాట్నే చదివించలేదు. నైన్త్ వరకే చదివాడు. ఇప్పుడు వాడి గతేమిటి? ఇంటి నిండా చిన్న చిన్న పిల్లలు. పొద్దున లేస్తే ఏదో ఒకటి అడుగుతుంటారు. ఇంట్లో ఇబ్బందులు గమనించగల వయసు కాదు వాళ్ళది.

తిండి గింజలు కాసిని ఉన్నా... పై ఖర్చు కావాలి-గదా. వేరే ఆదాయ మొచ్చే మార్గం లేదు....

ఇప్పుడు ప్రతి చిన్న వస్తువూ కొనుక్కోవాలిసిందే. ఊళ్ళో వాళ్ళకి మా అవసరం ప్రస్తుతం ఏం లేదు కాబట్టి వాళ్ళు చూసీ చూడనట్లే నిర్లక్ష్యంగా ఉండిపోతారు......

పరాయివాడు పాలించినప్పుడే నయం బాబూ నిశ్చింతగా ఉన్నాం. కరణం రెవెన్యూ డిపార్ట్-మెంటుకు పునాదిరాయి వంటివాడు అనే స్పృహతో వాళ్ళు ప్రవర్తించేవాళ్ళు.

గాంధీగారు కూడా సహాయ నిరాకరణ గ్రామాల-నుంచే ....గ్రామోద్యోగుల సహాయంతోనే ప్రారంభం కావాలన్నారు....మేం ఎవరినన్నా పీడిస్తున్నామా? ఎవరి పొట్టలైనా కొడుతున్నామా? ఈ సానుభూతి ప్రజలకే ఉండదు. మాలో మాకే ఉండదు. పొరుగు-వాడు పచ్చగా ఉంటే ఓర్వలేని జాతి మనది.....-కేవలం రెండు వందల ఇరవై అయిదు రూపాయలతో గవర్నమెంటు కింత గాడిద చాకిరి చేసేది ఎవరు చెప్పు? మా స్థానంలో వచ్చిన వాళ్ళు మా లా రెండు వందలకే చేస్తారా?

చెయ్యరు. చేస్తే మాడి చస్తారు.....

వాళ్ళకు ఫుల్ టైం జీతం ఇవ్వాలి. అంటే...మాకన్నా నాలుగు రెట్లు అధికంగా ఇవ్వాలి.

ఇది పొదుపా?

హఠాత్తుగా మమ్మల్నిలా లాగి పారేస్తే పరిస్థితి ఎంత అస్తవ్యస్తంగా ఉంది?

ఎవడైనా లోన్ పెట్టుకోవాలంటే....వాడి సర్వే నెంబరు, ఎంజాయ్‌మెంటు ఈ కొత్త ఉద్యోగికి తెలుస్తుందా ఖచ్చితంగా?

గ్రామంలో ఎవ రెలాంటి వారు? ఎవరి పొలం ఎవరు అన్యాయంగా ఆక్రమిస్తున్నారు? ఎవడు ఎంత పన్ను కడుతున్నాడు? ఎవడి సర్వే నెంబరు ఎంత? లోన్ వగైరాలు కావాలంటే శాంక్షన్ చెయ్యటానికి వాడి ఎంజాయ్‌మెంటెంత?

## విధి ఒక విషవలయం

ఫలానా పొలం గల గవరయ్యను నేనే అంటూ ఒకడొస్తే....వాడి ఐడెంటిఫికేషను, నిజంగా ఆ పొలం గల గవరయ్య వాడేనా?....

ఇవన్నీ ఆ గ్రామంలో పుట్టి..... ఆ మనుషుల మధ్య పెరిగి....వాళ్ళతో మసలే గ్రామ కరణానికి తెలిసినంత ఖచ్చితంగా కొత్తగా వచ్చిన వాళ్ళకి తెలుస్తుందా?

అయినా..... కొత్త వాళ్ళకు ఉద్యోగాలు కల్పించి మనుగడ ప్రసాదించటం గొప్ప గానీ.... అది ఉన్న వాడి కడుపుమీద కొట్టి, నడి రోడ్డు మీదకు లాగి, వాడు కుటుంబంతో మల మల మాడి చస్తుంటే....-ఆ ఉద్యోగం నీ కిస్తానంటూ వాడి కన్నీటితో తడిసిన గుడ్డతో అవతలి వాడి కళ్ళు తుడవటం ఏం న్యాయం?

నా కొడుకేం చేస్తున్నాడో తెలుసా బాబూ?

బ్రతకటానికి వేరే మార్గం లేక.....రోడ్డు మీద తారు పోస్తుంటే ఈ మద్దులూరులోనే ఆ కూలీలలో ఒకడుగా మారాడు. వాడిని చూస్తుంటే నా కడుపు తరుక్కు పోతుంది.

ఏదైనా బిజినెస్ చేసి నిశ్చింతగా సంపాయించుకో-గల ఆస్తి ఏ కరణమూ సంపాయించుకోలేదు

### ఫలితం....

కన్ను పొడుచుకున్నా కానరాని
చీకటిలో
గాలికన్నా వేగంగా పరుగెత్తాలని
ప్రయత్నిస్తే
ఫలితం ఎదురు దెబ్బలే!

ఉచ్చం నీచం తెలియని
మూర్ఖునితో
వాదనలో గెలవాలని ప్రయత్నిస్తే
ఫలితం పరాభవమే!

అవినీతి అన్యాయం, అధర్మం
రాజ్య మేలుతున్నంత కాలం
ఈ స్వార్థ సమాజాన్ని
సంస్కరించాలని ప్రయత్నిస్తే
ఫలితం పరాజయమే.

— కె. శివకుమారి.

నలుగురిలో గౌరవంగా బ్రతుకుతూ గ్రామంలో ఒకరిగా కలిసిపోయి, 'పరపతి సంపాయించుకునే చరిత్రే కరణానిది.

"వాళ్ళకేం? గాదె కింద పందికొక్కుల్లా గ్రామంలో చెలాయించి, తెగ సంపాయించారు" అంటారు బయట వాళ్ళు.

అదొక అలవాటు. మమ్మల్నే కాదు. ఎవరినైనా.....-నిస్సహాయ స్థితిలో ఉన్న వాళ్ళను చూసి ఇలా అనటమే మన కలవాటు. నడి ఏట్లో మునగబోతున్న వాడికి చెయ్యందించి సహాయం చేసే వాళ్ళకన్నా......-మా బాగా అయింది అని సంతోషంతో నవ్వుకునే వాళ్ళే మనలో ఎక్కువ.

ప్రజల సంక్షేమంకోసం పాటు పడుతున్నా-మంటుంది ప్రభుత్వం. కరణాలు, వాళ్ళ కుటుంబాలూ ప్రజలలో ఒక భాగం కాదా? యువకులకు ఉద్యోగాలిస్తామంటోంది.....

నా కొడుకు, వాడిలాంటి ఇతరులు యువకులు కారా? వాళ్ళ సంక్షేమం ప్రభుత్వానికక్కర్లేదా? మేమంతా వేగా? ప్రజలనుంచి విడిపోయి, వేరే జాతికి చెందిన వాళ్ళమా?

ఏమిటో బాబూ...ఏదేదో చెప్పి నిన్ను విసిగిం-చేస్తున్నాను. కడుపులో ఆవేదన అణుచుకోలేక. ..-పిల్లల మొహాల్లో దీనత్వం చూడలేక . పువ్వు లమ్మిన ఊరిలో కట్టె లమ్మలేక, వాటిని తీసుకుని ఇంత దూరం నడిచి రాలేక....రాక తప్పక...ఇంత మెంటల్ టార్చర్‌ను హరాయించుకోగల వయసు బలమైనా లేక...అప్పు డప్పుడిలా బరస్టయిపోతుంటాను" అంటున్న కరణం మాటలకు కదిలిపోయాడు జయాకర్.

"మీరేం అనుకోకపోతే....." అన్నా డతను సంకోచంగా.

"చెప్పు బాబూ."

అయిదు వంద రూపాయల నోట్లు తీసి ఆయన చేతుల్లో పెట్టబోతూ "ఆ రోజు మీరు చేసిన సహాయానికి ఏ మిచ్చినా మీ రుణం తీరదు. అమ్మగారికీ, పిల్లలకీ ఏమైనా కొనివ్వండి. నేను మీ కొడుకులాంటి వాడి ననుకోండి" అన్నాడు జయాకర్.

ఆ నోట్లు తిరిగి అతని జేబులో పెట్టేస్తూ, "ఆ రోజు నీకు ప్రతిఫల మాసించి ఆతిథ్యమివ్వ లేదయ్యా నే నే ముష్టివాడిగా, మారాలనుకుంటే . నా కీ వయసులో ఈ పళ్ళపాడి వ్యాపారం, నా కొడుక్కు కూలీ పనీ ఎందుకు?

ఒకనాటి గ్రామాధికార్లమనే ఇమేజ్‌తో ముష్టి అయితే బాగనే ముడుతుంది

కానీ, మేము బిచ్చగాళ్ళం కాదు. ఎప్పటికీ కాబోము కూడా

"విధి ఒక విష **వలయం** విషాద కథలకు అది నిలయం ." అన్నాడు కవి ఆ వలయంలో మాదో సరికొత్త కన్నీటి కథ" అంటూ వెళ్ళిపోతున్న కరణాన్ని చూస్తుంటే జయాకర్ కళ్ళలో నుంచి అశ్రు బిందువులు జలజలా రాలాయి కర్చీఫ్‌తో వాటిని అద్దుకుంటూ వికలమైన మనసుతో, అప్పుడే వచ్చి, ఆగిన బస్సులోకి ఎక్కాడతను.